క్లుప్తంగా

ప్రభలతీర్థంపై నేడు సమావేశం

అంబాజీపేట: ఏటా మొసలపల్లి శివారు జగ్గన్న తోటలో కనుమ రోజున నిర్వహించే ప్రభల తీర్థంపై మొసలపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. ఈ సమావేశానికి కొత్తపేట ఆర్డీవో హాజరు కానున్నారన్నారు. ఆయా గ్రామాల ప్రభల నిర్వాహకులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఘనంగా సహస్ర నామార్చన



బాలాజీ స్వామికి నిర్వహిస్తున్న సహస్ర నామార్చన

మామిడికుదురు: ధనుర్మాసంలో భాగంగా అప్పనపల్లిలో కొలువైన బాలబాలాజీ స్వామికి బుధవారం సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీటీడీ నుంచి వచ్చిన వేద పండితుల ఆధ్వర్యంలో ఈ పూజ ఆద్యంతం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు. విష్వక్సేనారాధన, పలు రకాల పుష్పాలు, తులసి దళాలతో స్వామికి సహస్ర నామ పూజలను కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మంగళా శాసనం ఘనంగా జరిపించారు.

రేపు ఉత్తర ద్వార దర్శనం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులకు కల్పిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ దర్శనాలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. భక్తులు ఉత్తర ద్వారం వద్ద స్వామిని దర్శనం చేసుకుని, తరించాల్సిందిగా ఆయన కోరారు.

రేపటి నుంచి సప్తాహం

మామిడికుదురు: పెదపట్నంలోని పురాతన ఉమా మూలేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కనకదుర్గమ్మ వార్ల ఆలయాల ప్రాంగణంలో 20వ సప్తాహం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ సప్తాహం 17వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. సప్తాహం నిర్వహణకు కమిటీ భారీగా ఏర్పాట్లు చేపట్టింది. 10వ తేదీ ఉదయం 5.49 గంటలకు తోరం యువరాజు, సూర్యకుమారి దంపతులచే కలశ స్థాపన జరుగుతుంది. దీనిలో భాగంగా పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. 10 నుంచి 17 వరకు నిరంతరాయంగా శ్రీరామనామ సర్వనామ కీర్తలతో భజన నిర్వహించనున్నారు. పురాతన కాలం నుంచి ఇక్కడ సప్తాహాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.


క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



సఖినేటిపల్లిలంకలో నీలిమ కుటుంబానికి సాయం అందజేస్తున్న అన్నపూర్ణ

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మార్గాని నీలిమకు, రామేశ్వరం ఎన్నారై, దోహా ఖతార్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశి కిరణ్ బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని ఆయన తల్లి, సఖినేటిపల్లి జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా నీలిమ కుటుంబ సభ్యులకు అందజేశారు. స్థానికులు దొండపాటి మోహన్, కొండా కిషోర్, రేపూరి ఏసు, పడాల శంకరం, యల్లమిల్లి కిషోర్, దొండపాటి పూర్ణ ప్రకాష్ పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి



శంకరగుప్తంలో తాగునీటి ట్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: నియోజకవర్గంలో తలపెట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అధికారులకు సూచించారు. మలికిపురం మండలం అడవిపాలెం, శంకరగుప్తం గ్రామాల్లో రూ.70.20 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన 40 వేల లీటర్ల మంచినీటి వాటర్ ట్యాంక్‌లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జల్‌జీవన్ పథకంలో ప్రతి ఇంటికీ తాగునీరందించాలన్న ఏకైక లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్‌లు కొల్లు అనంతలక్ష్మి, రాపాక ఆనందకుమార్, ఎంపీటీసీలు మానుకొండ ప్రమీల, ఆచంట మాణిక్యం, అంతర్వేది ఉత్సవ కమిటీ ఛైర్మన్ దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గెయిల్ నిధులతో ఇంటింటికీ తాగునీరు

- ట్రయల్ రన్ నిర్వహణ
- 70 శాతం పనుల పూర్తి

మామిడికుదురు: నగరం గ్రామంలో గెయిల్ నిధులు రూ.ఆరు కోట్లతో చేపట్టిన ఇంటింటికీ తాగునీటి పథకం పనులు చివరి దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం నగరం గ్రామంలోని ప్రధాన స్టోరేజ్ ట్యాంకుకు మానేపల్లి చానల్ నుంచి నీటిని పంపింగ్ చేస్తూ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఇంత వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 30 శాతం పనులను త్వరలోనే పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. 2020 సెప్టెంబరు నెలలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శంకుస్థాపన చేశారు. 2021 సెప్టెంబరు నాటికి పనులు పూర్తి కావాల్సి ఉండగా కోర్టు వివాదంతో పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. కోర్టు వివాదం ముగియడంతో పనులను శరవేగంగా నిర్వహించారు.

1900 గృహాలకు నీటిసరఫరా

ప్రస్తుతం నగరం గ్రామ జనాభా సుమారుగా ఎనిమిది వేల మంది ఉన్నారు. గ్రామంలో 1,900 గృహాల వరకు ఉన్నాయి. ఇంటింటికి తాగునీరు అందించేందుకు గ్రామంలో మొత్తం అయిదు స్టోరేజ్ ట్యాంకులు నిర్మించారు. 3.60 లక్షల లీటర్ల కెపాసిటీతో వీటిని ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండు లక్షల లీటర్ల కెపాసిటీతో ప్రస్తుతం మెయిన్ ట్యాంకు అందుబాటులో ఉంది. దీనికి అదనంగా మరో నాలుగు ట్యాంకులు నిర్మించారు. ఒక్కో ట్యాంకు కెపాసిటీ 40 వేల లీటర్లతో వీటిని ఏర్పాటు చేశారు. నగరంలో 57,180 క్యూబిక్ మీటర్లు కెపాసిటీతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఒక సంపు, మైక్రోఫిల్టర్, రెండు ఇన్‌టెక్ వెల్స్ సైతం నిర్మాణానికి నోచుకున్నాయి. 2.80 కిలోమీటర్లు పంపింగ్ మెయిన్‌తో పాటు 15 కిలోమీటర్లు డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్, ఆరు కిలోమీటర్లు మేర గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్‌లకు గాను చాలా వరకు పూర్తి చేశారు.



నగరంలో నిర్మించిన ప్రధాన స్టోరేజ్ ట్యాంకు



నగరంలో లక్ష లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన సంపు

కుళాయిలు, పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలి



గెయిల్ నిధులతో చేపట్టిన ఇంటింటికీ తాగునీటి పథకం పనులను త్వరితంగా పూర్తి చేయాలి. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. చాలా ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయిలు నిర్మించాల్సి ఉంది. దీంతో పాటు పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. శివారు ప్రాంతాలకు ప్రస్తుతం తాగునీరు అందక ఆ ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వేసవి నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి తాగునీటి కష్టాలను తొలగించాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జాలెం అనూష, ఎంపీటీసీ, నగరం

త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు



తాగునీటి ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. దీనిని సత్వరం పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం గ్రామంలో 23 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మించాల్సి ఉంది. ఇంత వరకు 18 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మించాం. మిగిలిన రెండు కిలోమీటర్ల పైప్‌లైన్‌తో పాటు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాం. రెండు నెలల్లో మొత్తం పనులు పూర్తి చేయిస్తాం.

– జాలెం రమణకుమారి, సర్పంచ్, నగరం

తక్కువ ఖర్చుతో నికర ఆదాయం



వానపల్లిలో దుంప పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తపేట: లంక, మెట్ట భూముల్లోని దుంప పంటల సాగులో శాస్త్ర, సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నికర ఆదాయాన్ని పొందవచ్చని ఉద్యాన శాస్త్రవేత్తలు తెలిపారు. కొవ్వూరు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పి.లలితా కామేశ్వరి, డాక్టర్ వి.శివకుమార్, డాక్టర్ కె.రవీంద్రకుమార్, స్థానిక ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు బుధవారం మండలంలోని వానపల్లి పరిసర లంక భూముల్లో దుంప పంటలను పరిశీలించారు. అనంతరం వానపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో దుంప పంటల యాజమాన్యం, వ్యాపించిన తెగుళ్ల నివారణ చర్యలు, పంటల అధిక దిగుబడులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.వీరేష్, ఉద్యాన విస్తరణ అధికారులు రాజు, సౌమ్య, గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు బి.మణికంఠ, కె.ప్రీతిమౌనిక తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ మెంబర్‌గా విశ్వనాథ్



నల్లి విశ్వనాథ్

సఖినేటిపల్లి: యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ మెంబర్‌గా మండలానికి చెందిన సదరు సంఘ ప్రతినిధి నల్లి విశ్వనాథ్ బుధవారం ఎన్నికయ్యారు. కాకినాడలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో ఈ మేరకు ఎన్నికైనట్టు ఆయన మీడియాకు చెప్పారు. కాగా సదరు సంఘ మండల అధ్యక్షుడిగా, కోనసీమ జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా, కుటుంబ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శిగా పనిచేసినట్టు విశ్వనాథ్ చెప్పారు.

టీడీపీ నేత ఆగడాలకు అడ్డూ అదుపూ లేదా?

- ఆత్రేయపురంలో అధికార పార్టీ నియంతృత్వ పాలన
- అనుమతులు లేకుండా భారీ వృక్షాలు, బస్ షెల్టర్ తొలగింపు

కొత్తపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో టీడీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోయింది. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తుండగా దానికి ఏమాత్రం తీసిపోని విధంగా ఇక్కడ అధికార పార్టీ నాయకులు నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆత్రేయపురంలో ఆ మండల టీడీపీ నాయకుడు ఏకఛత్రాధిపత్యంగా వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో, ప్రతిపక్షంలోనే కాక అధికార పక్షంలో కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ నాయకుడు చెప్పిందే వేదం, చేసిందే శాసనం అన్నట్టుగా అధికారులను సైతం తన గుప్పెట్లో పెట్టుకుని నియంత పాలన సాగిస్తున్నారని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. మంగళవారం ఆత్రేయపురంరేవులో ప్రజలకు నీడనిచ్చే రెండు భారీ వృక్షాలను, బస్ షెల్టర్‌ను సైతం తొలగించడం ద్వారా తారస్థాయిలో తన నియంతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలోకి వెళ్లే రోడ్డులో ఉన్న తన వ్యాపార సముదాయం ఆ భారీ వృక్షాలు వలన రావులపాలెం–బొబ్బర్లంక రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు కనబడటం లేదని ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఉన్న రెండు భారీ వృక్షాలను తొలగించి పర్యావరణానికి తూట్లు పొడిచారు. ఆ సమీపంలోనే ఆర్టీసీ బస్, ప్రైవేట్ వాహనాలు కోసం ప్రయాణికులు వేచి ఉండేందుకు సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన బస్ షెల్టర్‌ను సైతం ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి కూల్చేశారు. ఈ చర్యలను అడ్డుకోవలసిన అధికారులు అధికా మదానికి తలొగ్గి చేసేది లేక తోడ్పాటు అందిస్తున్నారని పలువురు ఆరోపించారు. ప్రభుత్వ శాఖల పరిధిలో ఉన్న వృక్షాలు, షెడ్లు తొలగించాలంటే ఆయా శాఖల అనుమతులు తీసుకోవాలి. నిబంధనలు అనుసరించి తొలగించాలి. కానీ అటువంటి ప్రక్రియలు పాటించకుండా వృక్షాలను, బస్ షెల్టర్‌ను తొలగించడమేంటి? పచ్చదనాన్ని రూపుమాపడమేంటి? అని స్థానికులు వ్యాఖ్యానించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఆత్రేయపురం మండలంలో ప్రధానంగా అడిగేవాడు లేడని ఆ టీడీపీ నేత ఈ రకంగా అధికార దుర్వినియోగానికి పాల్పడటంపై ప్రజలు ఆక్షేపిస్తున్నారు. పూర్వీకులు పెంచిన పచ్చని చెట్లను కేవలం ఒక వ్యక్తి వ్యాపార స్వలాభానికి అడ్డుగా ఉందని భావించి తొలగించడం అధికార టీడీపీ ఆగడానికి అద్దం పడుతుంది. వ్యవసాయ అధికారులను తన పొలాల చుట్టూ తిప్పుకోవడంతో పాటు ఉపాధి కూలీలతో తన పంట పొలాల్లో పనులు చేయించుకుంటూ వేరేచోట పనులు చేసినట్టుగా మస్టర్లు వేయిస్తున్నారని, అతని మాట వినలేదనే కారణంగా 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను సైతం తొలగించి తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించుకున్నారు. ఏ విధమైన అనుమతులు లేకుండా భారీ వృక్షాలను, బస్ షెల్టర్‌ను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.



ఆత్రేయపురం రేవులో భారీ వృక్షం మొదలు తొలగిస్తున్న జేసీబీ



ఆత్రేయపురం రేవులో బస్ షెల్టర్‌ను తొలగిస్తున్న జేసీబీ

గోల్డ్‌లోన్ ఇచ్చినపుడే నామినీని తీసుకోండి

మలికిపురం: ఎస్‌బీఐ ఖాతాదారులు గోల్డ్ లోన్ తీసుకున్నప్పుడు నామిని పద్ధతి లేకపోవుట వలన చాలా ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ కమిటీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. మలికిపురం మండలం లక్కవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక వ్యక్తి గోల్డ్ లోన్ పెట్టినప్పుడు అతను మరణిస్తే వారి కుమారులు, కుమార్తెలు బ్యాంకు చుట్టూ చాలా సార్లు తిరగవలసి వస్తుందన్నారు. వారు వేర్వేరు ప్రాంతాల్లో ఉండటం వలన అందరూ ఒకేసారి రావాలంటే వారికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. కావున ఇతర బ్యాంకుల్లా నామిని పద్ధతిని ప్రవేశపెట్టాలని ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టికి ఓ లేఖ ద్వారా కోరినట్లు ఆయన వివరించారు. అలాగే పలు సమస్యలను కూడా లేఖలో ప్రస్తావించారు.

ఉచిత కళ్లజోళ్ల పంపిణీ

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో బుధవారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ జరిగింది. విమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈవైద్య శిబిరంలో ట్రస్ట్ ఛైర్మన్, ఏజీపీ బూసి విద్యాప్రసన్న గ్రామానికి చెందిన 45 మంది రోగులకు ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. ఈదల సత్తిబాబు, పాలూరి గోవిందు, ముప్పిరి వెర్రియ్య, దిడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ పరామర్శ



మునీశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ

ఆలమూరు: గ్రామంలో మాతృవియోగంతో బాధపడుతున్న వ్యాపారవేత్త, మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకర రావును రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. స్థానిక పసుపులేటి గూడెంలో నివాసం ఉంటున్న ప్రభాకరరావు నివాసానికి శనివారం ఆయన విచ్చేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఛైర్మన్‌గా పని చేసిన మాతృమూర్తి మునీశ్వరమ్మ మృతికి గల కారణాలను ఆమె కుమారులను అడిగి తెలుసుకున్నారు. చల్లా కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మునీశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



కొత్తపేట డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు వేసిన ముగ్గులు

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల సంక్రాంతి ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రాజు పర్యవేక్షణలో కళాశాల కల్చరల్ కమిటీ, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లుల పోటీల్లో ఒకరిని మించి ఒకరు అన్నట్టు ఎవరికి ఎవరు తీసిపోకుండా రంగు రంగుల ముగ్గుల ద్వారా తమ ప్రతిభను చాటారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజోలు డిగ్రీ కళాశాలలో సంక్రాంతి ఉత్సవాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

రాజోలు: సంక్రాంతికి స్వాగతం పలుకుతూ రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం ఉత్సవాలు నిర్వహించారు. కళాశాల సాంస్కృతిక సమన్వయకర్త శైలజ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. అలాగే విద్యార్థినులు సంక్రాంతి పిండి వంటకాలను తయారు చేశారు. రంగవల్లుల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వేమగిరి కోకోకోలా కంపెనీ సమకూర్చిన బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నల్లి రాజు, సరిత, డాక్టర్ చంద్రబోస్, పల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.


రంగా విగ్రహం తొలగింపు.. ఏర్పాటు

అంబాజీపేట: కె.పెదపూడి గాంధీ సెంటర్‌లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి శుభాకాంక్షలు పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీని పక్కనే కాపు సామాజిక వర్గానికి చెందిన యువత మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దాంతో వివాదం ముదిరి గాంధీ విగ్రహానికి ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం పక్కన రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ జి.సరోవర్, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అనుమతులు లేకుండా రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఎంపీడీవో, తహసీల్దార్ వద్ద నుంచి ఫిర్యాదు రావడంతో తాము సంఘటన స్థలానికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. దాంతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సైలు బి.శివకృష్ణ, ఎ.చైతన్యకుమార్, జి.సురేంద్రలు రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సాయంతో రంగా విగ్రహాన్ని తొలగించారు. విగ్రహాన్ని తొలగించవద్దని కాపు సామాజిక వర్గీయులు అడ్డుకుని, ఆందోళన చేస్తున్న కొంత మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం మండల వ్యాప్తంగా తెలియడంతో కాపు సామాజిక నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులతో చర్చించారు. ఫిర్యాదు ఎవరిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై ఎంపీడీఓను ఆందోళనకారులో ఫోన్‌లో సంప్రదించగా తాము ఫిర్యాదు చేయలేదని చెప్పారు. కె.పెదపూడిలో తొలగించిన స్థానే రంగా విగ్రహాన్ని మరోసారి ఏర్పాటు చేశారు. అనంతరం అదే సామాజికవర్గానికి చెందిన మహిళలు, యువకులు రంగా విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సంఘటనా స్థలానికి వచ్చిన ఎంపీడీఓతో నాయకులు చర్చించి అనుమతులు లేకుంటే అన్ని విగ్రహాలు తొలగించాలని లేదా యథాతథంగా ఉంచాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ శాంతి కమిటీ ఏర్పాటు చేసి వివాదాలను చర్చిద్దామని అంత వరకు యథాతథస్థితిని కొనసాగిద్దామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.



కె.పెదపూడిలో ఆందోళనకారులతో చర్చిస్తున్న ఎంపీడీఓ, పోలీస్ సిబ్బంది

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు



అంబాజీపేటలో జరిగిన ఆటల పోటీలకు హాజరైన డీఈవో సలీంబాషా

మామిడికుదురు/కొత్తపేట/అంబాజీపేట/ఆలమూరు/పి.గన్నవరం: వివిధ మండలాల్లోని పాఠశాలల ప్రాంగణాల్లో జరుగుతున్న మండల స్థాయి ఆటలు పోటీలు ముగిశాయి. విద్యార్థులు ఈ పోటీల్లో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, బాల్‌త్రో, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడాంశాల్లో పాల్గొని విద్యార్థులు తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని డీఈవో తదితరులు తెలిపారు.

కిడ్స్ ప్యారడైజ్ మాసపత్రిక ప్రారంభం

అంబాజీపేట: హైస్కూల్ విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేందుకు సోషల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో కిడ్స్ ప్యారడైజ్ మాస పత్రికను తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం పీవీ కేశవాచార్యులు బుధవారం ఆవిష్కరించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఒక నెలకు సంబంధించి జరిగిన కార్యక్రమాలు అన్నింటిని ఉత్సాహంగా ఉండే విద్యార్థులు సేకరించి ఒక మాస పత్రిక విడుదల చేస్తారన్నారు. ఈ పత్రికకు హెచ్ఎం కేశవాచార్యులు ఎడిటర్ ఇన్ చీఫ్‌గాను, సోషల్ స్టడీస్ టీచర్ మట్టపర్తి రాంబాబు ఎడిటర్‌గాను, సోషల్ స్కూల్ అసిస్టెంట్ గంటి శ్రీనివాస్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తారన్నారు. డిసెంబర్ నెలలో జరిగిన ముఖ్యమైన విషయాలను విద్యార్థులు క్రోడీకరించి మొదటి సంచికగా జనవరిలో మాస పత్రికగా రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తొండవరంలో కిడ్స్ ప్యారడైజ్ మాస పత్రికను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎమ్మెల్సీ పరామర్శ

అయినవిల్లి: ఐద్వా నాయకురాలు, సీపీఎం సీనియర్ నాయకురాలు కుడుపూడి రాఘవమ్మ మృతి తీరని లోటని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తొత్తరమూడిలోని రాఘవమ్మ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

సఖినేటిపల్లి: మండలంలోని మోరి, మోరిపోడు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వపరంగా రైతులకు అమలు చేస్తున్న పథకాలు గురించి మండల ఏవో పీవీ నరసింహారావు వివరించారు. వరి నారుమడుల్లో, వరినాట్లు వేస్తున్న పొలాల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి ఆయన తెలిపారు. ప్రధానంగా ప్రస్తుత తరుణంలో కాండం తొలుచు పురుగుతెగులు, ఆకుముడత తెగులు ఆశించినట్టు ఏవో అన్నారు. ఈ తెగులు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాము మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాగా మడుల్లో నారు తీయడానికి వారం రోజులు ముందు ఐదుసెంట్ల మడిలో మొవ్వ తెగులు నివారణకు 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, రైతులతో సదరు శాఖ ర్యాలీలు నిర్వహించింది. వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ సిబ్బంది ఆర్.స్నిగ్ధ, వి.శ్వేత పాల్గొన్నారు.



మోరిపోడులో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న ఏవో

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

అయినవిల్లి: కిశోర బాలికలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యం ఉండటం కోసం తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ జి.భీమారావు, సీడీపీఓ వై.విజయశ్రీ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం సీడీపీఓ వై.విజయశ్రీ అధ్యక్షతన జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్యం, వారి పోషణ, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశాలపై శిక్షణ నిచ్చారు. మహిళా సంరక్షణ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు.

గుర్తుతెలియని మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

రావులపాలెం: మండలంలోని కొమరాజులంక వంతెన వద్ద బస్టాండులో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు టౌన్ సీఐ శేఖర బాబు బుధవారం తెలిపారు. మృతుని వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. అమలాపురం రోడ్డు ఉన్న బస్టాండ్‌లో ఈ మృతదేహం ఉందన్నారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని కొత్తపేట మార్చురీలో ఉంచామన్నారు. మృతుని వివరాలు తెలిసినవారు రావులపాలెం ఎస్‌హెచ్‌ఓకి లేదా స్టేషన్ ఎస్సైకి సమాచారం ఇవ్వాలన్నారు.